చలి పంజా

జిల్లాలో చలి పంజా విసురుతోంది. రాత్రి సమయాల్లో ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. ఉదయం పొగ మంచు ఊపిరి ఆడనివ్వడం లేదు. జిల్లాలోని పలు మండలాల్లో 12 డిగ్రీల కంటే తక్కువగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు వాతావరణ కేంద్రం అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఉదయం పూట వ్యవసాయ పనులకు సైతం వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు.

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రోజు రోజుకు చలి తీవ్ర పెరుగుతుంది. ఎక్కువ అటవీ ప్రాంతం, కొండలు, గుట్టలతో కూడుకొని ఉండడంతో రాష్ట్రంలో ఇతర జిల్లాలతో పోలిస్తే చలి ఎక్కువ ఉంటుంది. జిల్లాలో రెండు మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గుతూ వస్తుండడంతో మంగళవారం ఉదయం రాష్ట్రంలోనే అత్యల్పంగా ఉన్న ప్రాంతాల్లో సిర్పూర్(యు) మొదటి స్థానంలో నిలిచింది. కాగా మంగళవారం నమోదైన ఉష్ణోగ్రతలో అత్యల్పంగా నమోదైన ప్రాంతాల్లో జిల్లాలోని సిర్పూర్(యు) మండలంలో 8.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదై రాష్ట్రంలోనే రికార్డుగా నిలిచింది. లింగాపూర్ 10.1, కెరమెరిలో 10.2, వాంకిడిలో 11.1 డిగ్రీలు, గిన్నెధరి, ఆసిఫాబాద్‌లో 11.5 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఒక వైపు అత్యధికంగా చలి నమోదు అవుతున్న వేళ ఉదయం సాయంత్రం మంచుతో రహదారులు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. జిల్లాలో రహదారులపై మంచు ఎక్కువగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వృద్ధుల్లోనూ..

వృద్ధులపై చలి ప్రభావం ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. మొదట ముక్కు కారడం కనిపిస్తుంది. దీన్ని అప్పర్ రెస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్ అంటారు. ఇది ఎక్కువైతే ముక్కును దాటి ఊపిరితిత్తుల్లోకి చల్ల గాలి వెళితే వాయునాళాలు కుంచించుకుపోతాయి. దీని వల్ల శ్వాస ఇబ్బందితో పాటు దగ్గు తీవ్రమవుతుంది. ఇన్‌ఫెక్షన్ లోపలికి చేరితే కనీసం రెండు నుంచి మూడు నెలలు ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చల్లటి నీరు, చల్లగి గాలి, దుమ్ము లోపలికి చేరకుండా నివారించాలి. ఈ సీజన్‌లో ఆస్తమా ఉన్న వారు చలిబారిన పడితే అది మరింత ఎక్కువ వ తుంది. కొన్ని బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు కూడా దాడి చేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది కలిగినా సొంత వైద్యం చేసుకోకుండా ఆస్పత్రులకు వెళ్లాలని సూచిస్తున్నారు.



కెరమెరిలో చలిమంట కాస్తున్న గ్రామస్థులు

ఆసిఫాబాద్‌లో కమ్ముకున్న పొగ మంచు

- జిల్లాలో కనిష్ఠ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు
- సిర్పూర్(యు)లో 8.4 డిగ్రీలు
- ఉదయం వేళ కమ్ముకుంటున్న పొగ మంచు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

● రానున్న మూడు రోజుల్లో..

రానున్న మూడు రోజుల్లో చలి తీవ్రత మరింత పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అవసరమైతే రాత్రి పూట బయట తిరగాలని సూచిస్తున్నారు. ఆస్తమా ఉన్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం ఇంటింటా దగ్గు, జ్వరాలు ప్రబలుతున్నాయని చెబుతు న్నారు. పిల్లలతో పాటు వృద్ధులు చలి తీవ్రతకు ఇబ్బందులు పడుతున్నారు. చలి వాతావరణంలో పిల్లలపై ఎక్కువగా వైరల్ ఇన్‌ఫెక్షన్లు దాడి చేసే ప్రమాదం ఉంది. ముఖ్యంగా హైపోథెర్మియా (శరీరం చల్లబడడం)తో సమస్యలు వస్తాయి. మొదట జలుబు సోకి తర్వాత వైరస్‌లతో న్యుమోనియా, ఫ్లూ లాంటివి అధికమవుతాయి. కొన్ని సందర్భాల్లో ఆరోగ్యం విషమించే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. చలికాలంలో పిల్లలకు ఆకలి సైతం మందగిస్తుంది. దీంతో వారు మరింత నీరస పడిపోతారు. దురద, పెదాలు పగిలి మంటతో బాధపడుతారు.

ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలి


వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికార యంత్రాంగం పకడ్బందీగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం న్యూఢిల్లీ నుంచి ముఖ్యమంత్రి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి రాష్ట్రం నుంచి రాష్ట మంతులు కోమటిరెడ్డి వెంకటిరెడ్డి, జూపల్లికృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, కొండ సురేఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖల అధికారులతో వరి ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా రాష్ట్రంలో దాదాపు 8,012 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో సన్నరకం, దొడ్డురకం ధాన్యం కొనుగోలులో ఎలాంటి అక్రమాలు జరగకుండా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. త్వరలో రేషన్ కార్డులకు, వసతి గృహాలకు సన్న బియ్యం అందించే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఆ దిశగా సన్నరకం ధాన్యం కొనుగోలు త్వరగా పూర్తిగా చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని వసతులు కల్పించాలని సూచించారు.కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేష్ దోతేర, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు మనోధైర్యంతో అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవను పురస్కరించుకుని మంగళవారం జిల్లా మహిళ, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ గిరిజన క్రీడా పాఠశాలలో దివ్యాంగులకు నిర్వహించిన ఆట పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడ ఎతూ దివ్యాంగులు నిరుత్సాహ పడకుండా అవకాశం ఉన్న ప్రతి రంగంలో మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి డిసెంబరు 3న నిర్వహించే అంతర్జాతీయ దినోత్సవ వేడుకల్లో బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖాధికారి బాస్కర్, గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, వెంకటేష్, విద్యాసాగర్, రవికుమార్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించే జిల్లా స్థాయి ఇన్‌స్పేర్ మనాక్, బాల వైజ్ఞానిక ప్రదర్శనలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా నియమించిన కమిటీల వారు అంకిత భావంతో కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య సూచించారు. వైజ్ఞానిక ప్రదర్శనల సన్నాహక సమావేశాన్ని మంగళవారం పాఠశాలలో వివిధ కమిటీల బాధ్యులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 ఇన్‌స్పేర్ మనక్ ప్రాజెక్టులు, 200పైగా బాల వైజ్ఞానిక ప్రదర్శనలు ఈ వైజ్ఞానిక ప్రదర్శనలలో పాల్గొనున్నట్లు తెలిపారు.

భీమన్న మైదానాన్ని పరిశీలించిన జీఎం

రెబ్బెన, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గోలేటిలోని భీమన్న మైదానాన్ని జీఎం శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. 91వ వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా మైదానంలో నిర్మిస్తున్న పిచ్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం డిసెంబరులో కంపెనీ స్థాయి క్రికెట్ పోటీల కోసం ఏర్పాట్లను సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. అనంతర చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన మిని పార్కును కూడా పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీర్ భీంరావు జాడె, సివిల్ ఎస్ఈ మదీనా భాషా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్ పాల్గొన్నారు.

భర్తను హతమార్చిన భార్య

కాగజ్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం నజ్రూల్ నగర్ విలేజీనంబరు2లో భర్తను భార్య హతమార్చింది. సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేంద తెలిపిన వివరాల ప్రకారం విలేజీనంబరు2లో నివాసం ఉంటున్న దూలాల్ సర్కార్(42) తరుచూ భార్య సరస్వతి సర్కార్‌ను వేధించే వాడు. సోమవారం రాత్రి సైతం గొడవ జరిగింది. దీంతో పోరు భరించలేక ఇంటో మంగళవారం ఉదయం ఇంట్లో ఉన్న క్రికెట్ బ్యాట్‌తో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలతో దూలాల్ సర్కార్ అక్కడికక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు వారు తెలిపారు.

పశ వైద్యశాల తనిఖీ

సిర్పూర్(టి), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పశు వైద్యశాలను మంగళవారం జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ సురేష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ భవిత, గోపాల మిత్ర రమేష్, భాస్కర్, రాజేశ్వర్, ప్రకాష్, నాందేవ్ పాల్గొన్నారు.

నేటి నుంచి కంకాలమ్మ జాతర

కౌటాల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రం సమీపంలో ఎత్తైన గుట్టపై ఉన్న కంకాలమ్మ దేవాలయం ప్రాంగణంలో బుధవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించే జాతర కోసం ఆలయం ముస్తాబైంది. ఉత్సవాలు ఐదు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. డిసెంబరు 1న నిర్వహించే జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సుల్వ కనకయ్య ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యార్థిని మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

కెరమెరి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురై హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో 20 రోజులుగా చికిత్స పొందుతూ విద్యార్థిని శైలజ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని మాలి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిని మృతికి కారణంగా అధికారుల నిర్లక్ష్యమేనని చెప్పారు. విద్యార్థికి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మోతీరాం, ధృతాబాయి, ఉత్తం నాయక్ పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

వాంకిడి, నవంబరు 26: వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ బుధవారం తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. చిరంజీవి, కార్తీక్, టి కానంద్, తిరుపతి, శ్రీకాంత్, ప్రణయ్, రాజ్ కుమార్, వికాస్, మహేష్, శ్రీకాంత్, సాగర్, పోచన్న, తిరుపతి, నిఖిల్ పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

బెజ్జూరు/కెరమెరి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):వాంకిడి మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురై హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో 20 రోజులుగా చికిత్స పొందుతూ విద్యార్థిని శైలజ ఆత్మకు శాంతి కలగాలని బెజ్జూరు, కెరమెరి మండల కేంద్రాల్లో మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తిరుపతి, వెంకటేష్, జావీద్, అశోక్, సుధాకర్, రాందాస్, గణేష్, హిరాజీ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పహారాలో వాంకిడి

- ధాబా గ్రామానికి శైలజ మృతదేహం తరలింపు - అంబులెన్స్‌ను చుట్టుముట్టిన గ్రామస్థులు
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల ఆందోళన- ఎమ్మెల్సీ లిఖిత పూర్వక హామీతో ముగిసిన అంత్యక్రియలు


ఆందోళన చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, విద్యార్థి సంఘాల నాయకులు

వాంకిడి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వాంకిడిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని అస్వస్థతతో మృతి చెందడంతో మంగళవారం వేకువజామున హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో గ్రామంలో ఎలాంటి అల్లర్లు చోటు చేసుకోకుండా సోమవారం రాత్రి నుంచే మండల కేంద్రంలో జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలమ్ పర్యవేక్షణలో డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గత నెల 30న పాఠశాలలో వాంతులు, విరేచనాలో అస్వస్థతకు గురై 27 రోజులుగా హైదరాబాద్ నిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందిన శైలజ సోమవారం సాయంత్రం మృతి చెందింది. హైదరాబాద్ నుంచి విద్యార్థిని మృతదేహాన్ని వాంకిడి మండలంలోని ధాబా గ్రామానికి తరలించే క్రమంలో ఉద్రికత్తత తలెత్తకుడా పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా సోమవారం రాత్రి నుంచే బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు బందోబస్తు మధ్య విద్యార్థిని మృతదేహాన్ని మంగళవారం తెల్లవారుజామున శైలజ సొంత గ్రామమైన ధాబాకు తరలించారు. అక్కడికి చేరుకున్న అంబులెన్స్‌ను స్థానికులు చుట్టుముట్టారు. విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వాంకిడి మండలంలోని పలుగ్రామాల చౌరస్తాల వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. విద్యార్థిని స్వగ్రామామైన ధాబాకు ఎవరు వెళ్లకుండా అడ్డుకున్నారు. మాలీ సంక్షేమ సంఘం నాయకులు, బీఆర్ఎస్, వివిద సంఘాల నాయకులను సోమవారం రాత్రి ముందుస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతురాలి బంధువులను, ప్రజాప్రతినిదులను, మీడియా ప్రతినిదులను సైతం విద్యార్థిని ఇంటికి వెళ్లకుండా పోలీసులు మార్గ మధ్యలోనే అడ్డుకున్నారు. ఎమ్మెల్సీ దండే విఠల్, డీడీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్‌రావు విద్యార్థిని కుటుంబ సభ్యులను పరామర్శించారు

- విద్యార్థి సంఘాల బైఠాయింపు..

విద్యార్థిని శైలజ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల నాయకులు ఇంటి ముందు బైఠాయించారు. శైలజ కుంటుంలో ఒకరికి ఉద్యోగం, ఇల్లు, ఐదు ఎకరాల భూమి, 50 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘా ల నాయయులు ఆందోళనకు దిగారు. జిల్లా కలెక్టర్ వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేవరకు దహన సంస్కా రాలు చేయనీయమని మొండికేశారు. విద్యార్థులను పట్టించుకోలేదని ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్‌రావు ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే విద్యార్థిని శైలజ మృతి చెందిందని ఆరోపించారు. ఇన్‌చార్జి మంత్రి సీతక్క తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని తండ్రికి ఔట్‌సోర్సింగ్‌లో ఉద్యోగం, డబుల్ బెడ్ రూం ఇల్లు ఎ ఇస్తున్నట్లు ఎమ్మెల్సీ దండే విఠల్, డీటీడీవో రమాదేవి లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు. రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా విషయం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూ స్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమిం చారు. అనంతరం పోలీసు బందోబస్తు మధ్య విద్యార్థిని శైలజ అంత్యక్రియలు నిర్వహించారు.


ధాబా గ్రామానికి వెళ్లే దారిలో పోలీసుల తనిఖీలు

నియోజకవర్గంలో పోలీసుల ఆంక్షలు

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పోలీసుల ఆంక్షలు విధించారు. రెండు నెలల క్రితం జైనూరులో జరిగిన అల్లర్ల నేపథ్యంలో ప్రస్తుతం వాంకిడి ఘటన కూడా అలా జరుగుతుందని ఇంటెలిజెన్స్ వర్గాల హెచ్చరికల నేపథ్యంలో పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. ధాబా గ్రామానికి మీడియాతో పాటు బయటి వ్యక్తులు ఎవరిని కూడా అనుమతించలేదు. కాగా శైలజ మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి తరలిస్తున్న క్రమంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శకు వెళ్తుందనే సమాచారం నేపథ్యంలో సోమవారం రాత్రి ఎమ్మెల్యే ఇంటిని పోలీసులు దిగ్బందనం చేసి ఆమెతో పాటు బీఆర్ఎస్ కార్యకర్తలను గృహ నిర్బందం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. పోలీసులు అడ్డుకుంటే ఆగే ప్రసక్తే లేదని హెచ్చరించారు. రాత్రి హైటెన్షన్ కొన సాగగా మంగళవారం ఉదయం ఆమెను ధాబా గ్రామానికి వెళ్లేందుకు అనుమతించారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ కమిటీ చైర్మన్ అంబేద్కర్ ఆధ్వర్యంలో రచించిన భారత రాజ్యాంగం ఆమోదం పొందిన తేదీని పురస్కరించుకుని మంగళవారం జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగి దినోత్సవాన్ని వివిధ సంఘాలు, విద్యా సంస్థల్లో ఘనంగా నిర్వహించారు. అలాగే బీజేపీ పార్టీ జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీని వాస్ ఆధ్వర్యంలో , బీసీ సంఘ భవనంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో, జక్కాపూర్ పాఠశాలలో, ఎంఎం హెల్ప్‌లైన్ ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు విశాల్, జయరాజ్, మంగ, పెంటయ్య, మారుతి, జక్కయ్య, తిరుపతి, శంకర్, మారుతి, దత్తు, శ్యాంలాల్, వినోద్, హరీష్, రమేష్, కమలాకర్, సంతోష్, భీంరావు, విశ్వనాథ్, రాజు, గురుమూర్తి, ఎండీ అహ్మద్, జాకీర్ హుస్సేన్, పవన్, మన్సూర్, ముజాహిద్, గౌస్‌ఖాన్, సమీర్‌ఖాన్, మథిన్, రాజశేఖర్, విజేష్, సుభాష్ పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేత్వాన్ బుద్ధ విహార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ ఉపాసకులు పాండుజీ, విలాస్, రాజేంద్రప్రసాద్, విక్రు, హంసరాజ్, శ్యాంరావు, రాజేశ్వర్, దేవాజీ, రోషన్, ఓమాజీ, అజయ్, రోషన్, బలవంత్, జైపాల్, శివాజీ, శ్రీనివాస్, నాగేష్, సిద్దార్థ, మహేష్, రమేష్, పాండు తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోటారిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్‌పాషా పాల్గొని ఈజీఎస్ కూలీలను సన్మానించారు. అనంతరం గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ఇందాపూర్‌లో రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ మల్లయ్య, కార్యదర్శులు సతీష్, బొజ్జిరావు పాల్గొన్నారు.

బెజ్జూరు: మండల కేంద్రంలో రాజ్యాంగ దినో త్సవం ఘనంగా జరుపుకున్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఈజీఎస్ నిదులతో పశువు పాక నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గౌరి శంకర్, ఏపీఓ రాజన్న, ఏపీఎం మోహన్‌లాల్, కార్యదర్శి తుకారాం, ఐకేపీ అధ్యక్షురాలు శ్రీదేవి, సీసీలు భద్రయ్య, పద్మ, ఎఫ్ఏలు రవికుమార్, నాయకులు శ్రీవర్ధన్, హకీం, జావీద్‌అలీ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


వాంకిడిలో రాజ్యాంగదినోత్సవంలో పాల్గొన్న నాయకులు

జైనూర్: మండలంలో భారత రాజ్యాంగ దినోత్స వాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, డైరెక్టర్లు మండాడి లింగరాజు, పంద్ర షేకు, నీలబాయి, ఆత్రం భుజంగ్‌రావ్, ఎంఈవో మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు): మండల కేంద్రంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. కార్యక్ర మంలో మాజీ ఎంపీపీ ఆత్రం భగ్వంత్‌రావ్, ఎంపీ డీవో క్రిష్టారావ్, తహసీల్దార్, ఉదయ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్: మండలంలో రాజ్యంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కూర్మత విశ్వనాత్ తదితరులు హాజరయ్యారు.

సిర్పూర్(టి): సిర్పూర్(టి) గ్రామ పంచాయతీ భవనంలో ప్రజాపాలన విజయోత్సవ, భారత రాజ్యాంగ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో ఎక్కువ పని దినాలు చేసిన కూలీని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, స్థానికులు తెలిపారు.


జైనూరులో కూలీలను సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్


బెజ్జూరులో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, అధికారులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో సింగరేణి ఉద్యోగి మృతి


తిరుపతి (ఫైల్)

మంచిర్యాల అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఓవర్ బ్రిడ్జిపై సోమవారం రాత్రి వాహనం అదుపుతప్పి బరతపు తిరుపతి (31) అనే సింగరేణి కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన తిరుపతి భార్య సోనియా అనారోగ్య కారణంగా కాలేజీరోడ్‌లో గల తల్లిదండ్రుల వద్ద ఉంది. భార్యను చూసేందుకు సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై మంచిర్యాలకు వస్తుండగా ఫ్లైఓవర్ వంతెన మూలమలుపు సమీపంలో వాహనం అదుపుతప్పడంతో ఫుట్ పాత్‌పై ఉన్న విద్యుత్ స్తంభం పిల్లర్‌కు బైక్ ఢీకొంది. తిరుపతి తలకు బలమైన గాయమై అక్కడికక్కడి మృతిచెందాడు. భార్య, రెండేండ్ల పాప ఉన్నారు. సోదరుడు రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్సైరాములు తెలిపారు.

యువకుడికి గాయాలు

శ్రీరాంపూర్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడ్డాడు. సుల్తానాబాద్‌కు చెందిన రాజశేఖర్ మంచిర్యాలలోని ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తున్నాడు. మంగళవారం స్వగ్రామానికి బైక్‌పై వెళ్తూ శ్రీరాంపూర్ బస్టాండ్ దాటిన తరువాత సింగరేణి ఓబీ కంపెనీకి చెందిన బొలెరో వాహనాన్ని వెనుకనుంచి ఢీకొట్టాడు. రోడ్డుపై పడిపోవడంతో అతనికి గాయాలయ్యాయి. స్థానికులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

పట్టుబడిన గంజాయి దహనం


గంజాయి నిల్వలతో పోలీస్ అధికారులు

మంచిర్యాల అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల వ్యాప్తంగా 2021 నుంచి నమోదైన 64 కేసుల్లో నిందితుల నుంచి సీజ్ చేసిన రూ.1,30,38,600 విలువ గల 521.544 కేజీల గంజాయిని మంగళవారం దహనం చేసినట్లు రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కోర్టు అనుమతి తీసుకొని న్యాయమూర్తుల ఎదుట దహనం చేశామన్నారు. కమిషనరేట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఇన్సినేటర్ ఫ్యాక్టరీ వద్ద పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ దహనం చేశామని సీపీ తెలిపారు. డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ సభ్యులు డీసీపీ అడ్మిన్ రాజు, గోదావరిఖని, జైపూర్ ఏసీపీలు ఎం.రమేష్, వెంకటేశ్వర్లు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ జి.సతీష్, అడ్మిన్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

లక్షెట్టిపేటరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చందర్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాలప్రేంసాగర్‌రావు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా రూ.1.50 కోట్లతో చేపట్టే పనులకు భూమి పూజ చేశారు. ఎంపీడీవో సరోజ, ఎంపీవోశ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆరీఫ్, త్రిమూర్తి, ఏపీవో వేణు, పింగిలి రమేష్ పాల్గొన్నారు.

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): పలు అభివృద్ధి పనులకు లక్షెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చందు భూమి పూజ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తూ ప్రజలు, రైతులకు అండగా ఉంటుందన్నారు. మామిడిపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి రాజ్యాంగదినోత్సవ వేడుకలను నిర్వహించారు. తాళ్ళపేట జీపీలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మండల ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపిడివో ప్రసాద్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

హాజీపూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఈజీఎస్ పథకం ద్వారా అభివృద్ధి పనులను అధికారులు,నాయకులు ప్రారంభించారు. ర్యాలీ గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): దాంపూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను గ్రామ స్పెషల్ ఆఫీసర్ నాగశిల్ప, కార్యదర్శి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి మోహన్‌రెడ్డి,నాయకులు రవి, మాజీ జెడ్పీటీసీ తిరుమల పాల్గొన్నారు.

వేమనపల్లి, (ఆంధ్రజ్యోతి): కేతనపల్లి, నీల్వాయి గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈజీఎస్ ఏపీవో సత్యప్రసాద్, మాజీజెడ్పీటీసీ సంతోష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి

కాసిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి ఆశ్రమ పాఠశాలలో భోజనం వికటించి మృతిచెందిన విద్యార్థి శైలజ మృతికి కారణమైన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని మంగళవారం ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు దేవాపూర్‌లో నిరసన చేపట్టారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెడ్మ కిషన్ మాట్లాడుతూ కుటుంబానికి రూ.50 లక్షలు, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆడె జంగు, పెంద్రం హన్మంతు, అనంతరావు, ఆత్రం జంగు, పాల్గొన్నారు.

కన్నెపల్లి, (ఆంధ్రజ్యోతి): వాంకిడి ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని శైలజ మృతిచెందడం బాధాకరమని, ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని మాలి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చెండె సత్యనారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని శైలజ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

బీసీ చైతన్య సభను విజయవంతం చేయండి

దండేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వైశ్య భవనంలో ఈనెల29న నిర్వహించే బీసీ చైతన్య మహాసభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్‌గౌడ్ పిలుపునిచ్చారు. దండేపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, కులగణనపై చర్చిస్తామన్నారు. వెంకటేష్, లక్ష్మీనారాయణ, నర్సయ్య, శంకర్ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

దండేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్‌ప్రసాద్ పటేల్ ఆరోపించారు. జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థుల సమావేశంలో మాట్లాడారు.కళాశాలకు సొంత భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పెరుగుతున్న మిరప సాగు

- ఈ ఏడాది 1,384ఎకరాల్లో పంట
- గతంలో అధిక దిగుబడి.. అధిక రాబడే కారణం
- తెగుళ్లు సోకుతున్నాయని రైతుల ఆందోళన


మిర్చి పంట

కౌటాల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మిరప పంట సాగు పెరు గుతోంది. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా రైతులు 1,384ఎకరాల్లో మిర్చి పంట వేశారు. కౌటాల మండలం మహారాష్ట్ర సరిహద్దు ఉండడంతో సరిహద్దు గ్రామలైన తాటిపల్లి, కన్కి, మొగడ్‌దగడ్, గుడ్లబోరి గ్రామాల్లో మిర్చి పంట సాగు అవుతుంది. ఇక్కడ పండిన పంటకు మహారాష్ట్రలో అధిక డిమాండ్ ఉండడంతో ఈ ప్రాంత రైతులు నాగ్‌పూర్‌కు తీసుకెళ్లి విక్రయించడంతో కొంత మేరకు లాభాలు వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది తాటిపల్లి, కన్కి, మొగడ్‌దగడ్, గుడ్లబోరి, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి, సాండ్‌గాం, పార్డి, వీరవెల్లితో పాటు తదితర గ్రామాల్లో సుమారు 1,097 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేస్తున్నారు. కౌటాల మండలంలోని మిర్చి పంట పండిస్తున్నారు. దీంతో పాటు దహెగాం 95 ఎకరాల్లో, పెంచికలపేటలో 90 ఎకరాల్లో, చింతలమానేపల్లిలో 49 ఎకరాల్లో, సిర్పూర్(టి)లో 53 ఎకరాల్లో పంట వేశారు.

● గత ఏడాదితో పోల్చితే రెట్టింపు..

గత ఏడాది జిల్లాలో రైతులు సుమారు 600 ఎకరాల్లో మిర్చి పంట వేశారు. ధర కూడా గత ఏడాది బాగా రావడంతో ఈ ఏడాది 1,384 ఎకరాలో పంట వేశారు. గతంలో వేరే పంటలు వేసి దిగుబడి రాక నష్టపోయిన రైతులు సైతం మిర్చి పంటపై ఆసక్తి చూపుతున్నారు. అప్పుల్లో కూరుకు పోయిన రైతులు కూడా మిర్చి సాగుపై అధిక దిగుబడి రావడంతో లక్షల్లో లాభం పొందారు. తమ ప్రాంతంలో నీటి, విద్యుత్ సౌకర్యం అందుబాటులో ఉండడంతో మిర్చి పంటపై దృష్టి సారించి మంచి దిగుబడి సాధించినట్లు ఈ ప్రాంత రైతులు చెబుతున్నారు.


తెగుళ్లతోమారిన కాయల ఆకారం

● పెరుగుతున్న సాగు ఖర్చులు..

మిర్చి పంట సాగుకు ఖర్చులు పెరిగిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో మిర్చి పంట సాగుతో అధిక దిగుబడి వస్తుండగా దానికి తగట్లు రాబడి సైతం అధికంగానే ఉండేది. క్వింటాలుకు రూ.20 వేలు పలుకుతుండగా ఖర్చులు తక్కువగా ఉండేవి. దీంతో మిర్చి పంట పై ఆసక్తి కనబర్చిన రైతులకు పంట సాగు చేయగా ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల మూలంగా ఖర్చులు అధికమవుతుండడంతో పాటు దిగుబడి సైతం అంతంత మాత్రంగా వస్తుందని పేర్కొంటున్నారు. గతంలో ఎకరానికి 30 నుంచి 35 క్వింటాళ్ల పంట వచ్చింది. ప్రస్తుతం మొదటి నెలలోనే త్రిప్స్ నల్లి విపరీతంగా రావడంతో దీని నివారణ కోసం రెండు నుంచి నాలుగు సార్లు స్ప్రే చేయాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. 70 నుంచి 80 రోజుల్లో కొమ్మ తెగులు వచ్చి కొమ్మలు తెగి పోవడంతో ఆరు నుంచి ఎనిమిది రకాల మందులు స్ప్రే చేశామని చెప్పారు. తెగుళ్ల బారిన పడడం వల్ల ఈ ఏడాది దిగుబడి తగ్గుతుందని ఆవేదన చెందుతున్నారు.


తెగుళ్లతో ముదిగి పోయిన కాయలు

డిమాండ్ లేక ఇబ్బందులు..



మిర్చి పంటకు ప్రస్తుతం డిమాండ్ లేక పోవడంతో సగానికి పైగా ధర పడిపోయింది. రూ.20 వేలు పలకాల్సిన మిర్చి రూ.12 వేలు పలుకుతుండడంతో రైతులు నష్ట పోయే అవకాశం అధికంగా ఉంది. దీనికి తోడు ఖర్చులు పెరగడం గతంలో వచ్చిన లాభాలు వస్తాయన్న నమ్మకం లేదు.

- రోహినే ఆనంద్‌రావు, కౌటాల

తెగుళ్లు సోకడంతో అవస్థలు..



మిర్చి పంటకు మొదటి నెల నుంచే తెగుళ్లు సోకడంతో అధిక మందులు స్ప్రే చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొమ్మ తెగుళ్లు వచ్చి కొమ్మలు తెగి పోవడం, గుండు తెగతో ఇబ్బందులు రావడం అధిక ఎరువులు వాడాల్సిన పరిస్థితి నెలకొంది. మిర్చి పొడుగులో కాకుండా గుండ్రంగా వస్తుండడంతో ఆందోళన చెందుతున్నాం.

- దత్తు పాండురంగ్, కౌటాల

అభివృద్ధి పనులకు నిధులు


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

-కాగజ్‌నగర్, నవ్యాంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపట్టే అభివృద్ధి పనుల నిధులు విడుదలైనట్లు జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్‌లో గ్రామ పంచాయతీ భవనానికి భూమి మంగళవారం పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు 80 అంగన్‌వాడీల భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు 30 నూతనంగా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎన్‌ఆర్‌జీఎస్ కింద రూ.6 కోట్ల నిధులు, అంగన్వాడీ భవనాలకు రూ.9.60 కోట్ల నిధులు విడుదలైనట్టు వివరించారు. అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరుగ్యారంటీలు, ప్రజా సంక్షేమ అభివృద్ధి పథకాలపై చేపట్టిన ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు జిలాలో విజయవంతం చేయాన్నారు. డిసెంబరు 7న నిర్వహించనున్న విజయోత్సవాల్లో అధికారులు, ప్రజలు భాగస్వామ్యం చేయాలన్నారు. కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్లా మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు మాట్లాడుతూ ఎన్‌ఆర్‌జీఎస్ నిధులు కింద విడుదలైన నిధులతో చేపట్టే పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సీఈవో లక్ష్మీనారాయణ, డీఆర్‌డీవో దత్తాత్రేయ రావు, డీపీఎం రామకృష్ణ, డీఎల్‌పీవో ఉమర్ హుస్సెన్, ఎంపీడీవో రమేష్, పీఈవో బుచ్చన్న, ఈసీ శ్రావణ్ కుమార్, రాజేశ్వర్, గులాబ్ దాస్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

- పాఠశాలల్లో అదనపు గుదుల నిర్మాణం
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆస్పిరేషనల్ జిల్లా కార్యకలా పాలలో భాగంగా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. మంగళవారం న్యూఢిల్లీ నుంచి కేంద్ర ప్రభారి రజత్‌కుమార్ సైని ఆస్పిరేషనల్ జిల్లా కార్యకలాపాలలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్‌తో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పిరేషనల్ జిల్లా బ్లాక్ కింద కేంద్ర ప్రభుత్వ నిదులతో జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో గల గిరిజన పాఠశాలలు, అదనపు గదుల నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, గిరిజన గురుకులాల్లో, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు చలి తీవ్రత దృష్ట్యా వేడి నీటిని అందించేందుకు గీజర్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే గిరిజన గ్రామాల్లో ఆర్‌వో ప్లాంటు ఏర్పాటుకు చర్యలు చేపడుతామని, వ్యాధులకు గురైన వారిని ఆసుపత్రికి తరలించేందుకు వెంటిలేటర్స్‌తో కూడిన అంబులెన్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. కార్యక్ర మంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మీ నారాయణ, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, సంపూర్ణత అభియాన్ జిల్లా సమన్వయకర్త మణివేలు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ రూరల్: ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే అవకాశం లేదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. భారత ఎన్నికలలో పేపర్ బ్యాలెట్ విధానాన్ని మళ్లీ ప్రవేశ పెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు కొట్టి వేసిందని, ఈవీఎం ట్యాంపరింగ్ పై పిటీషనర్ చేసిన వాదనలను న్యాయస్థానం తిరస్కరించిందని కలెక్టర్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి, మాదారం టౌన్ షిప్‌లోని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించనున్న బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, డీటీపీ, స్పోకెన్ ఇంగ్లీష్, యోగా నేర్పించేందుకు శిక్షకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వచ్చే నెల 2 సాయంత్రం ఐదు గంటల లోపు గోలేటి జీఎం కార్యాయం పర్సనల్ డిపార్టుమెంటులో సేవా సమితి కోఆర్డినేటర్‌కు దరఖాస్తులు అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్‌నెంబరు9951214116ను సంప్రదించాలని కోరారు.

'విద్యార్థిని మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి'

కౌటాల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని మాలి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థిని మృతికి కారణంగా అధికారుల నిర్లక్ష్యమేనని పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలని, విద్యార్థికి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాందేవ్, ముక్తేశ్వర్, పాండురంగ్, వెంకటి, సంతోష్, భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

రెబ్బెన, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శైలజ అనే విద్యార్థిని మృతి చెందటంతో నిరసన కార్యక్రమాలు చేసేందుకు వెళ్లుతున్న బీఆర్ఎస్, బీజేపీ నాయకులను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో బీఆర్ఎస్ నాయకులు సంజీవ్ కుమార్, రంగు మహేష్, శ్రీధర్, మధునయ్య, దుర్గారావు, రాజేశ్వర్ రావు, ఆశోక్, భుజంగరావు, రాజేష్, శంకరమ్మ అరుణలు, బీజేపీ నాయకులు అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణ ఉన్నారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

లింగాపూర్ నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడమేత విశ్వనాథ్ అన్నారు. సోమవారం లింగాపూర్ మండలంలోని పిట్టాగూడ గ్రామంలో మహిళ సంఘానికి మంజూరైన కోళ్లఫామ్ పనులకు ఆయన భూమి పూజ చేశారు కార్యక్రమంలో డైరెక్టర్లు లోకేందర్, సునిల్, ఎంపీడీవో రామేశ్వర్, తహసీల్దార్ రాజేంద్రప్రసాద్, ఏపీవో చంద్రయ్య, ఏపీఎం దేవానందం పాల్గొన్నారు.

విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యం పెంచడమే లక్ష్యం

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఒకేషనల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల్లో వృత్తి విద్యా నైపుణ్యం పెంచడమే ఓజేటి(వృత్తిపై శిక్షణ) లక్ష్యమని డీఐఈవో కళ్యాణి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో ఓజేపీ శిక్షణ కేంద్రంను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాందాస్, అధ్యాపకులు సతీష్, రవికిరణ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

దహెగాం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో ఐదు పంచా యతీ భవనాలు, మూడు అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్, 15 ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిదులు మంజూరైనట్లు ఎంపీడీఓ రాజేందర్ తెలిపారు. ఒక్కో గ్రామ పంచాయతీ భవనానికి రూ.20 లక్షలు, అంగన్‌వాడీ కేంద్రానికి రూ.12 లక్షల చొప్పున నిధులు మంజూరైనట్లు తెలిపారు.

ప్రపంచానికి ఆదర్శం భారత రాజ్యాంగం


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుందని శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని జీఎం కార్యాలయం ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమల వేసి వేడుకలను ప్రారంభించారు. భారత రాజ్యాంగ పీఠికను అందరితో చదివించారు. మన రాజ్యాంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద లిఖితపూర్వక రాజ్యాంగం అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు, ఎస్‌సీ లైజన్ ఆఫీసర్ కిరణ్ కుమార్, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, డీజీఎంలు చిరంజీవులు, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో నిర్వహించిన కార్యక్రమంలో మేనేజర్ బి. బ్రహ్మాజీరావు, ఏఐటీయూసీ జాయింట్ సెక్రటరీ రాచర్ల చంద్రమోహన్, సంక్షేమాధికారి శంకర్, ఆర్‌కే 6 గనిపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేనేజర్ తిరుపతి, రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, సంక్షేమాధికారి సురేందర్, పిట్ కార్యదర్శి కారుకూరి నగేష్, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి టౌన్: రాజ్యాంగంతోనే ప్రతి ఒక్కరూ స్వేచ్చగా జీవించగలుగుతున్నారని జీఎం దేవేందర్ అన్నారు. జీఎం కార్యాలయంలో సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. కార్యాక్రమంలో పీఎం శ్యాంసుందర్, సలేంద్ర సత్యనారాయణ, పాల్గొన్నారు.

రెబ్బెన: రెబ్బెన మండలం గోలేటిలో సోమవారం భారత రాజ్యంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జీఎం శ్రీనివాస్ ఏఐటీయూసీ నాయకుడు బయ్య మొగిలి, ఎస్‌ఓటు జీఎం కె.రాజమల్లు, ఏరియా ఇంజనీర్ భీంరావు జాడే, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహర, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సన్ అధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.


మందమర్రిలో మాట్లాడుతున్న జీఎం దేవేందర్


రెబ్బెన మండలం గోలేటిలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

సింగరేణి సమాచారం

సమైక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం


మాట్లాడుతున్న బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

శ్రీరాంపూర్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు సమైక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని సింగరేణి కాలరీస్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ముష్కె సమ్మయ్య, బరపటి మారుతి, బద్రి బుచ్చయ్య, వెంగళ కుమారస్వామి అన్నారు. మంగళవారం ఏరియాలోని పలు విభాగాలలో పర్యటించి ఉద్యోగులతో సమావేశమయ్యారు. బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, పదోన్నతి పాలసీ అమలు, తదితర విషయాలపై చర్చించారు. అనంతరం నూతన నియామకాలు చేపట్టారు. ఏరియా స్టోర్స్ కన్వీనర్‌గా జి.బి. సురేష్, కో-కన్వీనర్‌గా నీరటి లక్ష్మయ్య, డిస్పెన్సరీ కన్వీనర్‌గా గడ్డం శ్రీనివాస్, కో-కన్వీనర్‌గా కొల్లూరి తిరుపతి, ఎస్ అండ్ పీసీ కన్వీనర్‌గా ఏల్పుల కుమారస్వామి, కో-కన్వీనర్‌గా కారుకూరి శ్రీనివాస్‌లను నియమించారు. సంఘం అభివృద్ధికి, బలోపేతానికి కృషి చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో గోళ్ల మహేందర్, పంచేర్పుల నరేష్, వంగ కుమారస్వామి, విజయలక్ష్మి, మల్లికార్జున్, నాగేశ్వర్ రావు, రమణ, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

అప్‌గ్రేడ్‌కు నోచుకోని పాలిటెక్నిక్ కళాశాలలు

5వ పేజీ తరువాయి

42 ఎకరాల విశాలమైన స్థలం...

బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాల 1993లో ఏర్పాటు చేశారు. ఈ కళాశాల 42 ఎకరాల విశాలమైన స్థలంలో ఉంది. కళాశాల భవనం, తరగతి గదులు, ప్రయోగశాలలు, వసతి గృహాలు ఉన్నాయి. ఇంకా 40 ఎకరాల స్థలం ఉంది. ఇందులో ఇంజనీరింగ్ కళాశాల భవనం నిర్మించవచ్చు. ప్రస్తుతం పాలిటెక్నిక్ కళాశాలలో వందలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేస్తే జిల్లా విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనుంది. గతంలో విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు మెడికల్ కళాశాలతోపాటు ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ఆందోళనలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో మెడికల్ కళాశాలను మంచిర్యాలకు కేటాయించారు. బెల్లంపల్లిలోని పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత అమలు చేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంజనీరింగ్ కళాశాల కోసం ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలి



బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మైనింగ్ చదువుతున్నాను. పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలి. పాలిటెక్నిక్ చదువు పూర్తయ్యాక దూర ప్రాంతాలకు వెళ్లి చదవాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు చొరవచూపాలి. కొందరు ఆర్థిక ఇబ్బందులతో ఇంజనీరింగ్ చదవలేక డిగ్రీ చదవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ప్రభుత్వం జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలి.

- నజీబ్, పాలిటెక్నిక్ విద్యార్థి , లక్షెట్టిపేట

ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈఈఈ కోర్సు చదువుతున్నాను. స్థానికంగా ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి చదవాలంటే ఆర్థిక భారంతో ఇబ్బందులు ఎదురవుతాయి. జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తే ఎంతో మంది విద్యార్థులకు మేలు జరుగుతుంది.

-అనూష, దండేపల్లి

ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి



ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 9 పాలిటెక్నిక్ కళాశాలలను ఇంజనీరింగ్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది. ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి బెల్లంపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయించాలి. ఎన్నికల సమయంలో ఇంజనీరింగ్ కళాశాల కోసం హామీలు ఇస్తున్నారు. అధికారంలోకి వచ్చాక విస్మరిస్తున్నారు. ఇంజనీరింగ్ కళాశాల లేక ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యకు దూరమవుతు న్నారు. ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు ఎమ్మెల్యే కృషి చేయాలి.

- శ్రీకృష్ణదేవరాయలు, విద్యార్థి సంఘం నాయకుడు

రైతుల ఖాతాల్లో నగదు జమ

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమంలో భాగంగా జిల్లాలో 315 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి నగదు వారి ఖాతాల్లో జమ చేశామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతిపాదించిన 326 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 315 కేంద్రాల ద్వారా 2,710 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 121 మంది రైతుల ఖాతాల్లో రూ.1.83 కోట్లు జమ చేశామని తెలిపారు. జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, మేనేజర్ శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో మాదిగలకు అన్యాయం



మందమర్రి లెదర్ పార్కు వద్ద మాట్లాడుతున్న డా. రామకృష్ణ

మందమర్రి టౌన్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పాలనలో మాదిగలకు తీరని ద్రోహం తలపెట్టారని రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు డా.పెరుమాండ్ల రామకృష్ణ మాదిగ తెలిపారు. మంగళవారం లెదర్ పార్కు వద్ద విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నార న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 9 లెదర్ పార్కులను ప్రారంభించాలని విన్నవించామన్నారు. మాదిగ హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు రేగొండ సునీల్ మాదిగ, నాయకులు సమ్మన్న, జమ్మికుంట లెదర్ పార్కు అధ్యక్షుడు స్వామి, రమేష్, పాల్గొన్నారు. పట్టణంలోని లెదర్ పార్కును రీజనల్ డైరెక్టర్ జన్ను ఉపేందర్‌సందర్శించారు.

ప్రజాప్రభుత్వంతోనే సబ్బండ వర్గాలకు న్యాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జన్నారం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రభుత్వంలోనే సబ్బండ వర్గాలకు న్యాయం జరుగుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం పొన్కల్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను, లోతొర్రె, గొండుగూడ గ్రామాల్లో అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు, మురిమడుగులలో ఫౌల్ట్రీ షెడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుందన్నారు. ఎంపీడీవో శశికళ, మండల అధ్యక్షుడు ముజఫర్ ఆలీ, పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే చెప్పండి

కాసిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా సవరణపై అభ్యంతరాలుంటే చెప్పాలని ఎంపీడీవో సత్యనారాయణసింగ్ అన్నారు. మంగళవారం రాజకీయ పార్టీల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాలో సవరణలు, అభ్యంతరాలుంటే చెప్పాలని కోరారు. రమణారెడ్డి, స్వామి, రమేష్ పాల్గొన్నారు.



చెక్కు చెదరని అద్దాల మేడ

- మూడు రాష్ట్రాల సరిహద్దులో ముచ్చటైన భవనం
- నూరేండ్లు నిండినా చెక్కు చెదరని వైభవం

చెన్నూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు... ఓ వైపు ప్రాణహిత, మరోవైపు గోదావరి నదుల గలగలలు... కనుచూపు మేర పరుచుకున్న పచ్చదనం.. మధ్య ఉంది అద్దాల మేడ.

కోటపల్లి మండల సరిహద్దుకు కేవలం కిలోమీటర్, చెన్నూరుకు 25కిలోమీటర్ల దూరంలో నేటి మహారాష్ట్రలోని సిరొంచ పట్టణంలో ఉందా మేడ... వందేళ్ళ క్రితం నిర్మించిన ఈ భవనం నేటికి చెక్కు చెదరకుండా పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఉత్తర, దక్షిణ సంస్కృతి సంప్రదాయాలు, వాస్తు కళలకు ప్రతీకగా నిలుస్తున్న ఈ అద్దాల మేడ పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఎత్తైన ప్రదేశంలో నిర్మించడం వల్ల ఇక్కడి నుంచి చూస్తే ప్రాణహిత, గోదావరి నదులు ఆకట్టుకుంటాయి. ఆంగ్లే యుల కాలంలో నిర్మించిన ఈ కట్టడం మొదట కలెక్టర్ బంగ్లాగా, నిజాం విముక్తి పోరాటంలో ఇండియన్ సైనికులకు ప్రధాన స్థావరంగా ఉపయోగపడగా నేడు విశ్రాంతి భవనంగా ఉపయోగపడుతోంది.

● ఇదీ నేపథ్యం

1904-05 మధ్య కాలంలో ఆంగ్లేయుల ప్రభుత్వంలో పనిచేసిన గ్లాస్‌ఫోర్డ్ అనే కలెక్టర్ ఈ మేడను నిర్మిం చినట్లు ఇక్కడి చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. ఆ కాలంలో మద్రాసు ప్రెసి డెన్సీలోని ఎగువ గోదావరి జిల్లా కేంద్రంగా సిరొంచ విలసిల్లింది. పరిపాలన వ్యవ హారాల సమన్వయం కోసం కలెక్టర్ గ్లాస్‌ఫోర్డ్ ఈ భవ నాన్ని నిర్మించారు. మూడంతస్తుల ఈ మేడలో కింది అంతస్తులో కార్యాలయం, రెండో అంతస్తులో కలెక్టర్ నివాసం, మూడో అంతస్తులో రక్షణ దళాలు ఉండేవి. మూడో అంతస్తు పైకి ఎక్కి చూస్తే చుట్టూ 15కిలో మీటర్లమేర పరుచుకున్న పచ్చదనం కనువిందు చేస్తుంది.



గ్రామాన్ని ఆనుకుని ప్రవహిస్తున్న గోదావరి, ప్రాణహిత నదులు

● గానుగ సున్నం దీని ప్రత్యేకత

ఈ భవన నిర్మాణంలో సిమెంటుకు బదులు గానుగ సున్నం వాడారు. సుద్ద బండలను కాల్చి తయారు చేసిన సున్నంలో తాడికాయ, నేరేడి ఆకుల మిశ్రమం, కరక్కాయలు వేసి రాళ్ల, ఇటుకల మధ్య అతుకులకు వాడారు. భవన నిర్మాణ మూలాల్లో ఎల్ ఆకారంలో ఉన్న రాగి పట్టాలు ఉపయోగించారు. పునాదుల్లో బండలను అతికించేందుకు ధసలం అనే పదార్థాన్ని వాడినట్లు తెలుస్తుంది. కిటికీలు, ద్వారాలకు వాడిన అద్దాలను ఇంగ్లాండ్ నుంచి తెప్పించారు. ఆ కాలంలో ఇక్కడి ప్రజలకు అద్దాలు అందుబాటులో లేకపోవడం, ఈ భవనానికి విరివిగా అద్దాలు ఉపయోగించడంతో దీనికి అద్దాల మేడగా పేరు వచ్చింది. కాలక్రమంలో అద్దాలు పగలడంతో కలపతో మరమ్మతు చేయించారు.



మరోవైపు భవనం లోపల అందమైన కళాకృతులతో రూపొందించిన వంటశాల, విశ్రాంతి గదులు అమి తంగా ఆకట్టుకుంటాయి. భవనం మూడు భాగాల్లో ఎటు చూసినా కనిపించే ఐదు బలమైన పిల్లర్లు ఆనాటి ఇంజనీరింగ్ ప్రతిభకు తార్కాణంగా నిలిచాయి. ఒక్కో అంతస్తులకు వెళ్లేందుకు కర్రతో తయారు చేసిన మెట్ల ను వాడారు. అవి నేటికి చెక్కు చెదరకపోవడం విశేషం.

● రాళ్లెత్తిన కూలీలు మనోళ్లే...

ఈ అద్దాల మేడ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలందరు జిల్లాకు చెందిన వారే. భవన నిర్మాణంలో చెన్నూరు, నస్పూర్, లక్షెట్టిపేట, ఆసిఫాబాద్‌కు చెందిన కూలీలు పాల్గొన్నట్లు చారిత్రక ఆధారాలను బట్టి స్పష్టమవు తుంది. ఈ మేడ నిర్మాణానికి ఏడాది కాలం పట్టినట్లు సమాచారం. భవనానికి ఆనుకుని వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. భవనానికి చేరుకునేందుకు ఒకేదారి ఉండగా చుట్టూ శత్రు దుర్భేధ్యమైన బండ రాళ్ల లోతైన ప్రాంతం ఉంది. భవనం పక్కనే ఉద్యాన వనం పచ్చదనంతో కళకళలాడుతుంది. ప్రస్తుతం దీనిని మహారాష్ట్ర ప్రభుత్వం విశ్రాంతి భవనంగా ఉపయో గించుకుంటుంది. నిత్యం మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులు ఇక్కడకు వస్తుంటారు.

● మిలటరీ కేంద్రంగా

నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ఇండి యన్ మిలటరీ దళాలు ఈ అద్దాల మేడలోనే ఉన్నట్లు చరిత్ర చెబుతుంది. అద్దాల మేడ లోపల సొరంగం ఉండేదని ఇక్కడ నుంచే సైనికులకు ఆయుధాలు అందే వని తెలుస్తుంది.

న్యూస్ బాక్స్

ఈవీఎంలు ట్యాంపరింగ్ కావు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంలు ట్యాంపరింగ్ కావని దేశ అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు మాత్రమే ఈవీఎం విశ్వసనీయతను ప్రశ్నించడం సరికాదన్నారు. పేపర్ బ్యాలెట్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టి వేసిందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్య, సాహిత్య, కళ క్రీడా రంగాల్లో ఉత్తమ సేవ లందించిన క్రైస్తవులు, క్రైస్తవుల సంస్థల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ పండగ సందర్భంగా రాష్ట్ర క్రైస్తవ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 30 సంవత్సరాలకు పైబడి ఉత్తమ సేవ, ప్రతిభ కనబర్చిన క్రైస్తవ వ్యక్తులు, సంస్థల నుంచి నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తులను కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో డిసెంబరు 5లోగా అందజేయాలని తెలిపారు.

రైతులకు అవగాహన

చెన్నూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆస్నాద గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వరిలో నాణ్యత ప్రమాణాలపై ఏవో యామిని రైతులకు అవగాహన కల్పించారు. హార్వెస్టర్ వరికోత కోసే సమయంలో ఆర్పీఎం 19గా ఉంచాలని సూచించారు. వరికోత తర్వాత కొయ్యలను కాల్చవద్దన్నారు. పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, ఏఈవోలు సాగర్, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి బాల విజ్ఞాన్ ప్రదర్శన

మంచిర్యాల అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 30, డిసెంబర్ 1 తేదీల్లో జిల్లాస్థాయి రాష్ట్రీయ బాల విజ్ఞాన్ ప్రదర్శన, ఇన్స్ పైర్ అవార్డ్‌మానక్ కార్యక్రమాలను నిర్వహిస్తామని డీఈవో యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు విజయవంతం చేయాలన్నారు.

న్యాయాన్ని అందించే గొప్ప శాసనం రాజ్యాంగం



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, పోస్టర్లను విడుదల చేస్తున్న అదనపు కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశ పౌరులకు సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించే గొప్ప శాసనం మన రాజ్యాంగమని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యున్నత ప్రజాస్వామ్య రాజ్యాంగం మనదేనని తెలిపారు. అధికారులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు.

గర్మిళ్ల, (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి మూల స్తంభమని అదనపు కలెక్టర్ మోతిలాల్ పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. భారత రాజ్యాంగ దినోత్సవం సంవిదాన్ దివాస్ నేషనల్ లాడేగా పిలుస్తారని తెలిపారు. లయన్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు బాలమోహన్, మధుసూదన్‌రెడ్డి, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ అధికారి రాజేశ్వర్‌రావు, హన్మంతరావు, రాజేశ్వర్, బాబు, చందు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టులో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు మాట్లాడారు. భారత రాజ్యాంగం ఎంతో గొప్ప దని పేర్కొన్నారు. జడ్జిలు అర్పితమారం రెడ్డి, ఉపనిషద్వాని, నిరోశ, న్యాయవాదులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి,(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంచందర్, డీఈ సాయికిరణ్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి పేర్కొన్నారు. ఆదర్శ పాఠశాలలో రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సారాతస్లీమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తహసీల్దార్ సతీష్‌కుమార్ సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. అందుగులపేట, బొక్కలగుట్ట మండల ప్రత్యేకాధికారి అనిత, ఎంపీడీవో రాజేశ్వర్‌లు ఉపాధి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

జైపూర్, (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని ప్రతీ ఒక్కరు గౌరవించాలని తహసీల్దార్ వనజారెడ్డి పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తహసీల్దార్, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఆర్‌ఐ తిరుపతి పాల్గొన్నారు.

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): అంబెద్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచ దేశాలకే స్ఫూర్తిదాయకమని అంబెద్కర్ యువజన జిల్లా కన్వీనర్ రవికుమార్ అన్నారు. జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి అంబెద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాపు, అంజన్న, సుధాకర్, రాజేష్, పాల్గొన్నారు.

మందమర్రి టౌన్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. మొయ్య రాంబాబు, నెర్వెట్ల శ్రీనివాస్, నర్సోజి, దాసరి రాములు పాల్గొన్నారు. ప్రపంచ దేశాలకు అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగమే దిక్సూచిగా మారిందని కాంగ్రెస్ నాయకుడు డా. రామకృష్ణ మాదిగ తెలిపారు. రాజ్యాంగాన్ని లేకుండా చేసే కుట్రలను సహించబోమన్నారు.

కాసిపేట,(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. దేవాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో రాజ్యంగ ఆవశ్యకతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమ తులు అందించారు. ఎంపీడీవో సత్యనారాయణసింగ్, బాపు, చిన్న భీమయ్య పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో అంబేద్కర్ సంఘం నాయకులు రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు లింగయ్య, గోపాల్, శంకర్,బోస్, రాజమల్లు, నరేందర్, సత్యం పాల్గొన్నారు.

మంచిర్యాల అర్బన్, (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి చైర్మన్ రావుల ఉప్పలయ్య, కమిషనర్ మారుతీ ప్రసాద్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): భీమారం ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. రాజ్యాంగ పీఠికను విద్యార్థులకు ఉపాధ్యాయులు చదివి వినిపించారు. తహసీల్దార్ సదానందం సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు.

లక్షెట్టిపేటరూరల్, (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ద్వారానే సమసమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అంబేద్కర్ యువజన సంఘం పట్టణాధ్యక్షుడు తొగరు రాజు అన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యేవినోద్

కన్నెపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మంగళవారం జన్కాపూర్‌లో రూ.3.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ డ్రైన్ నిర్మాణ పనులను, టేకులపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించే పంచాయతీ భవన నిర్మాణానికి, కన్నెపల్లిలలో రూ.12 లక్షలతో నిర్మించే అంగన్‌వాడీ భవనానికి, వీగాంలో రూ. 5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్, డ్రైనేజీ పనులను ప్రారంభించారు. కన్నెపల్లి రైతువేదికలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. నాయకులు మాధవరపు నర్సింగరావు, మండల అధ్యక్షుడు రామాంజనేయులు, భీమిని మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ రాకేష్ శర్మ, పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్, (ఆంధ్రజ్యోతి): ప్రజల మద్దతుతో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. తాళ్లగురిజాలలో రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్ ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు, యువకులు కోరిక మేరకు ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాత బెల్లంపల్లిలో రూ.50 లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఎంపీడీవో మహేందర్, కాంగ్రెస్ నాయకులు కారుకూరి రాంచందర్, హరికృష్ణ, సింగతి సత్యనారాయణ, సుధాకర్, సురేష్, భూమన్న, స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే

బెల్లంపల్లిరూరల్, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో బ్రాంజ్‌మెడల్ సాధించిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ విద్యార్థులు శశివరుణ్, వంశీ, హర్షవర్థన్, రవిచంద్రు, సాత్విక్‌లను, సిల్వర్ మెడల్ సాధించిన వికాస్, హృతిక్ తేజను మంగళవారం పాఠశాలలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ అభినందించారు. మరిన్ని పతకాలు సాధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించాలని సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయులు వామన్, పీడీ, రాజశేఖర్, పాల్గొన్నారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా కాంగ్రెస్ నాయకులు పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. చౌటపల్లిలో రూ.12 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి, తాండూర్‌లో రూ.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు, నర్సాపూర్‌లో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి


మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లతో సమావేశం నిర్వహించారు. సీఎం మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. సన్నరకంకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందిస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, గన్నీ సంచులు, టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. అధికారులు కొనుగోలుకేంద్రాలను పర్యవేక్షించాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ 3,68,140 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశామని, ఇప్పటి వరకు 2,325 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 79 మెట్రిక్ టన్నుల సన్నరకం కొనుగోలు చేశామన్నారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, అధికారులు బ్రహ్మారావు, కిషన్, గణపతి, సత్యం, వెంకేటశ్వర్‌రావు, శ్రీకళపాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలి

18 సంవత్సరాలు నిండిన వారందరు ఓటరు జాబితాలో వివరాలు నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. మంగళవారం ఐబీ చౌరస్తా నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 2కె రన్‌లో డీఆర్‌డీవో కిషన్‌తో కలిసి పాల్గొని మానవహారం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలని, మార్పులు, చేర్పులు, సవరణలపై ప్రచారం నిర్వహించాలన్నారు.

రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి

మందమర్రి టౌన్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోలు శ్రీనివాస్, అధ్యక్షుడు శంకర్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ బీసీల ఐక్యతే లక్ష్యంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ సమావేశాలు నిర్వహిస్తూ అందరిని ఐక్యం చేస్తున్నారని, ప్రభుత్వం చేపట్టిన కుల గణనకు తాము సహకరించినట్లు తెలిపారు. 29న పాదయాత్ర మంచిర్యాలకు చేరుకుంటుందని తెలిపారు. సమావేశానికి అధిక సంఖ్యలో తరలిరావాలని తెలిపారు. నెరెల్ల వెంకటేష్, అంజయ్య, సతీష్, శ్రీనివాస్, వేణు, శేఖర్, నర్సోజి, పాని పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

బెటాలియన్‌లో డీఐజీ తనిఖీలు

హాజీపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపేట 13వ బెటాలియన్‌లో టీజీఎస్‌పీ బెటాలియన్స్ డీఐజీ షర్ఫుద్దీన్ సిద్దిఖీ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది నిర్వహించిన పరేడ్‌ను పర్యవేక్షించారు. అనంతరం దర్బార్ నిర్వహించి సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. విధి నిర్వహణలో పోలీసులు అంకిత భావంతో పనిచేస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బెటాలియన్ అధికారులు, సిబ్బంది చేత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం బెటాలియన్ యూనిట్ ఆసుపత్రి, పోలీసు వెల్ఫేర్ స్టోర్‌ను సందర్శించారు. బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు, అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాసు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రకుమార్

జన్నారం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హైద్రాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డిసెంబరు 1న ఉదయం 11 గంటలకు తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే వార్షికోత్సవ సదస్సును విజయవంతం చేయాలని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చంద్రకుమార్ పేర్కొన్నారు. మంగళవారం రేండ్లగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఎవరూ కూడా ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకోవద్దని పేర్కొన్నారు. ప్రభుత్వం 50 సంవత్సరాలు దాటిన కౌలు రైతుకు, రైతు కూలీలకు రూ.15 వేల పింఛన్ ఇవ్వాలని, పంట బీమా కల్పించాలని, సేంద్రియ ఎరువులను సబ్సిడీ ద్వారా అందించాలన్నారు. సదస్సులో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ఇంద్రసేన, నరసింహ, వెంకటరెడ్డి, పవన్ కళ్యాణ్, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.



బెల్లంపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

అప్‌గ్రేడ్‌కు నోచుకోని పాలిటెక్నిక్ కళాశాలలు

- ఇంజనీరింగ్ చదువుకు ఇబ్బందులు
- దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడంలో ఆర్థిక భారం
- జిల్లాలో రెండు పాలిటెక్నిక్ కళాశాలలు
- రాష్ట్రంలో పలు పాలిటెక్నిక్ కళాశాలలు ఇంజనీరింగ్ కళాశాలలుగా అప్‌గ్రేడ్
- జిల్లా కళాశాలలకు తగ్గని చోటు
- ఎన్నికల హామీగానే మిగిలిన కళాశాల ఏర్పాటు

బెల్లంపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాలిటెక్నిక్, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్ళాల్సి వస్తోంది. ఇటీవల ప్రభుత్వం రాష్ట్రంలో పలు పాలిటెక్నిక్ కళాశాలలను ఇంజనీరింగ్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది. జిల్లాలో బెల్లంపల్లి, శ్రీరాంపూర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలు అప్‌గ్రేడ్‌కు నోచుకోలేదు.

దూర ప్రాంతాలకు పంపి ఇంజనీరింగ్ చదివించే ఆర్థిక స్థోమత లేక తల్లిదండ్రులు డిగ్రీ కోర్సుల్లో చేర్పిస్తున్నారు. ఎన్నికల సమయంలో కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చి అనంతరం విస్మరిస్తున్నారు.

బెల్లంపల్లిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, శ్రీరాంపూర్‌లో సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల ఉంది. ఈ కళాశాలలు దాదాపు 20 ఏండ్ల క్రితమే ఏర్పాటయ్యాయి. వీటిలో ఈఈఈ, ఈఐ, మైనింగ్, సివిల్, మెకానిక్, సీఎస్ఈ కంప్యూటర్స్ వంటి కోర్సులు ఉన్నాయి. బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో 540 మంది, శ్రీరాంపూర్ కళాశాలలో 900 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్నారు. పాలిటెక్నిక్ అనంతరం దూర ప్రాంతాలకు వెళ్లి ఇంజనీరింగ్ చదవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. హైద్రాబాద్, వరంగల్, జగిత్యాల, రంగారెడ్డి, మేడ్చల్ ప్రాంతాలకు వెళ్లి ఇంజనీరింగ్ చదువుతున్నారు. పేద విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదవాలంటే లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది.

జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల లేని వైనం

జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల రాష్ట్రంలో పది పాలిటెక్నిక్ కళాశాలలను ఇంజనీరింగ్ కళాశాలలుగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసినప్పటికీ జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాలలకు చోటు దక్కలేదు. ఇతర ప్రాంతాల్లో ప్రైవేట్‌లో ఇంజనీరింగ్ విద్య చదవాలంటే రూ. 10 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని పేర్కొంటున్నారు. ప్రైవేటు ఫీజులు చెల్లించలేని ఎంతో మంది విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు.

మిగతా 7వ పేజీలో..

నేషనల్ హైవే పనులను అడ్డుకోవద్దు



కిష్టాపూర్‌లో నేషనల్ హైవే పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హైవే పనులను ఎవరూ అడ్డుకోవద్దని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం కిష్టాపూర్‌లో జరుగుతున్న హైవే పనులను ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ హైవే కింద భూములు కోల్పోయి మొదటి విడత పరిహారం పొందిన రైతులకు హైకోర్టు ఉత్తర్వుల మేరకు పెరిగిన నష్టపరిహారం కూడా అందుతుందని పేర్కొన్నారు. ఇంకా భూనిర్వాసితులు ఎవరైనా రెవెన్యూ రికార్డుల్లో తప్పులు ఉంటే తహసీల్దార్‌ను సంప్రదించాలన్నారు. అనంతరం కుందారం, నర్సింగాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు టార్పాలిన్‌లు, గన్నీ సంచులు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యం తీసుకురావాలన్నారు. దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. ఆర్డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ వనజారెడ్డి, నేషనల్ హైవే అధికారి కృష్ణరెడ్డి, ఎన్‌హెచ్ కాంట్రాక్టర్ ప్రసాదరావు, ఆర్ఐ తిరుపతి ఉన్నారు.

చెక్కు చెదరని అద్దాల మేడ

- మూడు రాష్ట్రాల సరిహద్దులో ముచ్చటైన భవనం
- నూరేండ్లు నిండినా చెక్కు చెదరని వైభవం

7



పెరుగుతున్న మిరప సాగు

- ఈ ఏడాది 1,384 ఎకరాల్లో పంట
- గతంలో అధిక దిగుబడి.. అధిక రాబడే కారణం
- తెగుళ్లు సోకుతున్నాయని రైతుల ఆందోళన

6



తెగుళ్లు సోకి ఎండి పోతున్న పంట

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వామపక్ష సంఘాల నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో వామపక్ష కార్మిక సంఘాలు, రైతు సంఘాల నాయకులు బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహజ సంపదలు, ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పేందుకు కుట్రలు చేస్తోందన్నారు. కార్మిక చట్టాల సవరణ చేస్తూ కార్మికులకు అన్యాయం చేయాలని చూస్తోందన్నారు. కార్పొరేట్‌ల చేతిలో ప్రధాని మోదీ కీలుబొమ్మగా మారారన్నారు. నాయకులు చంద్రమాణిక్యం, దుంపల రంజిత్, లాల్‌కుమార్, బ్రహ్మానందం, దేవరాజ్, కలీందర్‌అలీఖాన్, బానేష్, ప్రకాష్, మంగ, రమాదేవి పాల్గొన్నారు.

సర్వే పనులను అడ్డుకున్న ప్రజలు



పనులను అడ్డుకుంటున్న స్థానికులు

కాసిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రొట్టెపల్లి ఏజెన్సీ ప్రాంతంలో అనుమతులు లేకుండా ప్రభుత్వ భూములను ఓరియంట్ సిమెంట్ కంపెనీ కొనుగోలు చేసి అటవీ శాఖకు అప్పగించడాన్ని నిరసిస్తూ మంగళవారం స్థానికులు పనులను అడ్డుకొన్నారు. గిరిజన సంఘం నాయకుడు పెంద్రం హన్మంతు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం స్థానిక గిరిజనులకు భూములను అప్పగించిందని, ఇప్పుడు రెవెన్యూ, అటవీ శాఖ భూములను ఓరియంట్ కంపెనీకి అమ్మినట్లు గుర్తించామన్నారు. ఈ భూములు సీఏ ల్యాండ్స్ కింద ఓరియంట్ కంపెనీ అటవీ శాఖకు అప్పగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఎలాంటి గ్రామసభలు లేకుండా భూములను లాక్కోవడం అన్యాయమన్నారు. జగన్, వినోద్, శ్రీనివాస్, రాందాస్, తిరుపతి, లింగారావు పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అందించే కరపత్రాలను మంగళవారం డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కరపత్రాల్లో కుటుంబ సంక్షేమం, ఎయిడ్స్, కుష్టు, మలేరియా, డెంగ్యూ వ్యాధుల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను ముద్రించామన్నారు. వీటిని వైద్య సిబ్బందికి అందజేసి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. డాక్టర్‌లు అనిత, సీతారామారాజు, కాంతారావు, విశ్వేశ్వర్‌రెడ్డి, ప్రశాంతి, సుమన్, కృపాబాయి, బుక్కా వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

వైద్య సేవలు సక్రమంగా అందించాలి

బెల్లంపల్లి,(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందించాలని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ అన్నారు. మంగళవారం రడగంబాల బస్తీలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. వైద్యులు సమయ పాలన పాటించాలని, రోగులకు అందుబాటులో ఉండి వైద్యం అందించాలన్నారు. వైద్యులు సుమంత్‌రెడ్డి, సుమలత, బుక్కా వెంకటేశ్వర్ ఉన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా తెలియ జేయునది ఏమనగా శ్రీ Adluri Madhukar S/o. Yellaiah, age : 37yrs, Occ: Coolie, R/o. H.No. 1-95, Uthkur, Luxettipet Mandal Mancherial garu Open Land adme asuring to an extent of 121 Sq.yards or 101.17 Sq.mtrs, Out of sy.No. 465/°c, Situated at Uthkur, Luxettipet, Mancherial లో కల ఈ హద్దులు

తూర్పు: Land of Vendor, పడమర : Land of Adluri Prathap, ఉత్తరం : 10feet Road Left by Pattedar, దక్షిణం Land of Vendor

కల దాని యజమాని అయి ఉండి సంపూర్ణ స్వాధీనము లో ఉండి నా క్లయింట్ శ్రీ రామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచి జన్నారం వారి వద్దతనఖా పెట్టుచున్నారు. కావున ఎవరికయినా ఎలాంటి హక్కులు కానీ అక్షేపనలు కానీ ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన (05) రోజుల లోపల ఈ క్రింది చిరునామాకు తెలియ జేయగలరు.

ఇట్లు సం/- పిన్నింటి అశోక్, అడ్వకేట్
3-7-852/1, వావిలాలపల్లి, కరీంనగర్.
సెల్ : 9849331558

దీక్ష దివస్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న బాల్క సుమన్

నస్పూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన కేసీఆర్ నిరాహార దీక్షను యాది చేసుకుంటూ ఈ నెల 29న జిల్లా కేంద్రంలో నిర్వహించే దీక్ష దివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపునిచ్చారు. నస్పూర్‌లోని జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలతో జిల్లా స్థాయి సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్ష దివస్ విధివిధానాలపై కార్యకర్తలకు సుమన్ దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై దీక్ష దివస్‌ను విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ సమాజాన్ని ఐక్యం చేసిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాల చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జీ తుల ఉమా, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా



పోలీసులతో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

జైపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసులు నిఘా ఉంచాలని పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సీపీకి ఏసీపీ వెంకటేశ్వర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించి, దర్యాప్తు జరిగిన కేసుల, ప్రస్తుత స్థితిగతులపై తెలుసుకున్నారు. సీపీ మాట్లాడుతూ నేరాల నియంత్రణ కోసం పోలీసులు సమష్టిగా కృషి చేయాలన్నారు. మావోయిస్టు ప్రభావిత గ్రామాలు, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు ఉన్నందున ఎప్పుడు అప్రమత్తంగా ఉంటూ నిఘా పెట్టి సమాచార వ్యవస్థను పటిష్ఠం చేయాలని సూచించారు. కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో ఉన్న ఫెర్రీ పాయింట్లను విజిట్ చేయాలని పేర్కొన్నారు. సీఐలు వేణుచందర్, రవీందర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసిన డీడీ



సరుకులను పరిశీలిస్తున్న డీడీ రవీందర్‌రెడ్డి

లక్షెట్టిపేటరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆ శాఖ ఉప సంచాలకులు రవీందర్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. వినియోగిస్తున్న ఆహార పదార్థాలు, సరఫరా అవుతున్న సరుకుల నాణ్యత గురించి తెలుసుకున్నారు. ఆహారంలో నాణ్యమైన సరుకులను వినియోగించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని డీడీ వివరించారు. మెనూ ప్రకారం ఆహారం అందించి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వసతి గృహం సంక్షేమాధికారులు రాజు, రాజ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

తాండూర్, (ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని మండల ప్రత్యేకాధికారి అంజయ్య సూచించారు. మంగళవారం మహాత్మాజ్యోతిబాపూలే ఆశ్రమ, కస్తూర్బా పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటకాలను, బియ్యం నిల్వలను పరిశీలించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్

CUB TRUST AND EXCELLENCE SINCE 1904

క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001.
ఇ-మెయిల్ ID: crmd@cityunionbank.in, ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తులు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) & (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ తెలిపిన విధంగా సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ శాఖ కార్యాలయాలో ఒకటి మరియు సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, పరిపాలనా కార్యాలయం నం.24-బి, గాంధీ నగర్, కుంబకోణం-612 001 యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సదరు ప్రకటన స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా ప్రకటనలో తెలిపిన మొత్తమును తిరిగి చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలను కోరుతూ దిగువ తెలిపిన తేదీలు గల డిమాండ్ ప్రకటనను జారీ చేశారు. దిగువ తెలిపిన పేర్లు కలిగిన రుణగ్రహీతలు పైన తెలిపిన చట్టబద్ధమైన ప్రకటన స్వీకరణ తరువాత కూడా సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ ఇందులో వివరించిన ఆస్తులను దిగువ సంతకందారు స్వాధీనం చేసుకున్నారని ఇందుమూలంగా దిగువ తెలిపిన పేర్లు గల రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది. సదరు ఆస్తులతో ఎటువంటి వ్యవహారాలు జరుపరాదని ముఖ్యంగా దిగువ తెలిపిన రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ వ్యవహారాలైనా పూర్తి బకాయిలు చెల్లింపు వరకు సదరు మొత్తం మరియు దానిపై వడ్డీని సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు చెల్లించుటకు లోబడియుంటాయి.

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, 4-3-75/2, హమీద్‌పుర, నేతాజీ చౌక్ సమీపాన, ఆదిలాబాద్ - 504001. ఆదిలాబాద్ శాఖ

I. రుణగ్రహీతల పేర్లు : నం.1) మెస్సర్స్ సాయి సుశాంత్ అగ్రో ట్రేడర్స్, నం.6-7-32/ఎ, గంజ్ రోడ్, ఆదిలాబాద్-504001. నం.2) శ్రీ గోక మహేందర్ రెడ్డి, తండ్రి గోక లింగా రెడ్డి, ఇ.నం.7-7-44/48/1/18, విద్యానగర్, బస్ డిపో ప్రక్కన, ఆదిలాబాద్-504001. నం.3) శ్రీమతి గోక విజయలక్ష్మి భర్త గోక మహేందర్ రెడ్డి, ఇ.నం. 7-7-44/48/1/18, విద్యానగర్, బస్ డిపో ప్రక్కన, ఆదిలాబాద్-504001.

డిమాండ్ ప్రకటన తేది : 30.07.2024, పత్రికా ప్రచురణ తేది : 03.09.2024, స్వాధీనతా తేది: 21.11.2024, బకాయి మొత్తం: రూ.56,08,007/- (రూపాయలు యాభై ఆరు లక్షల ఎనిమిది వేల ఏడు మాత్రమే), పూర్తి బకాయిలు చెల్లించునంతవరకు 11.11.2024 నుండి దానిపై తదనంతర వడ్డీతో తిరిగి చెల్లించవలసి ఉంది.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు సమయం ఉన్నందున చట్టంలోని సెక్షన్ 13లోని సబ్- సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా రుణగ్రహీతలు కోరబడుచున్నారు.

మా బ్యాంకుకు తనఖా పెట్టబడిన స్థిరాస్తి.
షెడ్యూల్-ఎ :
అస్తి - 1 : (శ్రీ గోక మహేందర్ రెడ్డి తండ్రి గోక లింగారెడ్డికి చెందిన అస్తి)

ఆదిలాబాద్, విద్యానగర్, బ్లాక్ నం.7, వార్డు నం.7 వద్ద గల నివాస ఇల్లు ఇ.నం.7-7-44/48/1/18, మొత్తం విస్తీర్ణం 1,170 చ.అడుగులు = 130 చ.గజాలు = 108.83 చ.మీటర్లు. ఇందులో ప్లింత్ ఏరియా గ్రౌండ్ ఫ్లోర్ 1,001 చ.అడుగులు. మొదటి అంతస్తు 852.18 చ.అడుగులు మరియు మొదటి అంతస్తు బాల్కనీ ఏరియా 181.31 చ.అడుగుల ఆర్‌సిసి రూఫ్ మరియు సరిహద్దులు : తూర్పు: రోడ్డు, పశ్చిమం: శేషుబాబు మరియు మహిపాల్ ఇల్లు, ఉత్తరం: మహేందర్‌రెడ్డి ఇల్లు, దక్షిణం : రోడ్డు.

అస్తి - 2 : (శ్రీ గోక మహేందర్ రెడ్డి తండ్రి గోక లింగారెడ్డికి చెందిన అస్తి)

ఆదిలాబాద్, విద్యానగర్, బ్లాక్ నం.7, వార్డు నం.7 వద్ద గల నివాస ఇల్లు ఇ.నం.7-7-44/48/1/18ఎ (7-7-44/48/1/18/3) మొత్తం విస్తీర్ణం 1,170 చ.అడుగులు = 130 చ.గజాలు = 108.83 చ.మీటర్లు. ఇందులో ప్లింత్ ఏరియా గ్రౌండ్ ఫ్లోర్ 1,020 చ.అడుగులు. మొదటి అంతస్తు 780.68 చ.అడుగులు మరియు మొదటి అంతస్తు బాల్కనీ ఏరియా 176.33 చ.అడుగుల ఆర్‌సిసి రూఫ్ మరియు సరిహద్దులు : తూర్పు: రోడ్డు, పశ్చిమం: శేషుబాబు మరియు మహిపాల్ ఇల్లు, ఉత్తరం: జి.మహేందర్‌రెడ్డి ఇల్లు, దక్షిణం : జి.మహేందర్‌రెడ్డి ఇల్లు.

II. రుణగ్రహీతల పేర్లు : నం.1) మెస్సర్స్ యుబి కేటరర్స్ & ఎంటర్‌ప్రైజెస్, డి.నం.3-1-183/59/1, తిలక్ నగర్, ఆంధ్రప్రదేశ్, ఆదిలాబాద్-504001. నం.2) శ్రీ ఉత్తర్‌వర్ నాగేష్, తండ్రి ఉత్తర్‌వర్ నగేష్ కిషన్, డి.నం.3-1-183/59/1, తిలక్ నగర్, ఆదిలాబాద్-504001. మరియు శ్రీ ఉత్తర్‌వర్ నాగేష్, తండ్రి ఉత్తర్‌వర్ నగేష్ కిషన్, 3-2650, క్రాంతి నగర్, వార్డు-27, ఆదిలాబాద్-504001. నం.3) శ్రీ ఉత్తర్‌వర్ కిషన్, తండ్రి ఉత్తర్‌వార్ నాగన్న, డి.నం.3-1-183/59/1, ఆదిలాబాద్-504001.

డిమాండ్ ప్రకటన తేది : 04.06.2024, స్వాధీనతా తేది: 21.11.2024, బకాయి మొత్తం: రూ.10,42,521/- (రూపాయలు పది లక్షల నలభై రెండు వేల ఐదు వందల ఇరవై ఒకటి మాత్రమే), పూర్తి బకాయిలు చెల్లించునంతవరకు 14.08.2024 నుండి దానిపై తదనంతర వడ్డీతో తిరిగి చెల్లించవలసి ఉంది.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు సమయం ఉన్నందున చట్టంలోని సెక్షన్ 13లోని సబ్- సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా రుణగ్రహీతలు కోరబడుచున్నారు.

మా బ్యాంకుకు తనఖా పెట్టబడిన స్థిరాస్తి.
షెడ్యూల్-ఎ : అస్తి - 1 : (శ్రీ ఉత్తర్‌వర్ కిషన్, తండ్రి ఉత్తర్‌వర్ నాగన్నకి చెందిన అస్తి)

ఆదిలాబాద్, శాటిగూడ, తిలక్‌నగర్ వద్ద గల సర్వే నం.23/బి లో ప్లాట్ నం.80 పై నం.3-1-183/59/1 నివాసిత ఇల్లు. విస్తీర్ణ ఏరియా: 30 అడుగులు x 50 అడుగులు = 1500 చ.అడుగులు = 166.66 చ.గజాలు. సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నం.81, పశ్చిమం : ప్లాట్ నం.79, ఉత్తరం: ప్లాట్ నం.75, దక్షిణం: రోడ్.

III. రుణగ్రహీతల పేర్లు : నం.1) మెస్సర్ బ్రాండ్ ఫ్యాక్టరీ, షాప్ నం.6, లేన్-1, కిష్టారెడ్డి కాంప్లెక్స్, ఆదిలాబాద్-504307. నం.2) శ్రీ దేశెట్టి రాకేష్, తండ్రి రాజేశ్వర్ దేశెట్టి. ఇ.నం.7-16, విద్యానగర్, ఇచ్చోడ, ఆదిలాబాద్-504307. నం.3) శ్రీమతి టి. సుజాత శెట్టి, భర్త దేశెట్టి రాకేష్, ఇ.నం.7-16, విద్యానగర్, ఇచ్చోడ, ఆదిలాబాద్-504307. నం.4) శ్రీమతి దేశెట్టి రాధ బాయి, భర్త రాజేశ్వర్, ఇ.నం.3-3-368, మహాలక్ష్మివాడ, ఆదిలాబాద్, తెలంగాణ-504001.

డిమాండ్ ప్రకటన తేది : 04.06.2024, స్వాధీనతా తేది: 21.11.2024, బకాయి మొత్తం: రూ.4,13,099/- (రూపాయలు నాలుగు లక్షల పదమూడు వేల తొంభై తొమ్మిది మాత్రమే), పూర్తి బకాయిలు చెల్లించునంతవరకు 09.08.2024 నుండి దానిపై తదనంతర వడ్డీతో తిరిగి చెల్లించవలసి ఉంది.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు సమయం ఉన్నందున చట్టంలోని సెక్షన్ 13లోని సబ్- సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా రుణగ్రహీతలు కోరబడుచున్నారు.

మా బ్యాంకుకు తనఖా పెట్టబడిన స్థిరాస్తి.
షెడ్యూల్-ఎ :
అస్తి - 1 : (శ్రీమతి దేశెట్టి రాధాబాయి, భర్త రాజేశ్వర్ హెచ్‌కు చెందిన అస్తి)

ఆదిలాబాద్, మహాలక్ష్మి వాడ, రెవెన్యూ గ్రామం వద్ద గల ఎమ్‌పిఎల్ డి.నం.3-1-1/3/736 గల 116 చ.గజాలు - 96.88 చ.మీ.ల మొత్తం విస్తీర్ణ సర్వేనం.70లో ప్లాట్ నం.99. సరిహద్దులు: తూర్పు: మదన్‌లాల్ ఖాళీ ప్లాట్, పశ్చిమం: సాకారపు సాంబయ్య ఇల్లు, ఉత్తరం: మెయిన్ రోడ్, దక్షిణం : మూగ బాపూరావ్ ఇల్లు.

ప్రదేశము : ఆదిలాబాద్
తేది: 21.11.2024

అధీకృత అధికారి
సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్

రిజిస్టర్డ్ కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287, టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్ www.cityunionbank.com